క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా చదివించాలి

• డీఈఓ మాణిక్యంనాయుడు



గుజ్జింగివలస హైస్కూల్‌లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

గుర్ల: ప్రణాళికా ప్రకారం చదివితే పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించవచ్చునని డీఈఓ యు. మాణిక్యంనాయుడు అన్నారు. మండలంలోని గుజ్జింగివలస, పాలవలస జిల్లా ఉన్నత పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. విద్యార్థుల రాత మెరుగుపడేలా ఇప్పటినుంచే శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఆయనవ వెంట ఎంఈఓ భానుప్రకాష్ ఉన్నారు.

ఏజీపీగా టీవీ రమణమూర్తి



టీవీ రమణమూర్తి

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా టీవీ రమణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా న్యాయమూర్తి బి.కనకలక్ష్మిని కలిశారు. రమణమూర్తిని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బీవీఎస్ రామారావు, అల్లు సత్యాజీ, న్యాయవాదులు త్రిమూర్తులు, డబ్ల్యూఎన్ శర్మ, బొడ్డు వెంకటరావు, వారాది ఈశ్వరరావు, బి.రామకృష్ణ, ఆర్. సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ఎం.అనురాధ, వి.రమణ, జి.చిట్టిబాబు, సీహెచ్‌ఆర్‌పీ నాయుడు, తదితరులు అభినందించారు.

అలసత్వం వహిస్తే చర్యలు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారి విమలమ్మ, తదితరులు

గజపతినగరం రూరల్: బోధన విషయంలో ఎటువంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని ఎంఈఓ విమలమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. తరగతుల వారీగా బోధన ఎలా సాగుతుందో ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. పర్యవేక్షణలో ఆమెతో పాటు సీఆర్‌పీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్...



మొక్కలు తొలగించడంతో కనిపిస్తున్న విద్యుత్ స్తంభం

చీపురుపల్లి: పూల మొక్కను తలపించే విధంగా ఆకులతో అల్లుకున్న విద్యుత్ స్తంభంపై సాక్షి పత్రికలో 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. స్తంభాన్ని అల్లుకున్న పిచ్చిమొక్కలు, పాదలను ఏఈ ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు.

విద్యా సామర్థ్యాలపై ఆరా



చిన్నారిని ప్రశ్నిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మండలంలోని అరిగిపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా 4, 5 తరగతుల విద్యార్థులకు గణితం బోధిస్తూ, వారి విద్యాసామర్థ్యాలపై ఆరా తీశారు. కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయాలని.. మధ్యాహ్న భోజన మెనూ అమలు చేయాలని.. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పొలాల్లోకి వర్షపు నీరు



రెండు రోజుల వర్షంతో పొలాల్లో చేరిన నీరు

వేపాడ: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లోకి నీరు చేరుతోంది. ఇప్పటికే వరినారు పోసే రైతులు ఇబ్బంది పడుతున్నారు. మూడు రోజులుగా దమ్ము, గొప్పు, పిసుకుడు అకులు పోయడంలో రైతులు బిజీగా ఉన్నారు. వరుణుడు శాంతించకపోతే వరి నారు పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే నీలగిరి, సరుగుడు నారు ఉడిచేందుకు వర్షం ఉపకరిస్తుందని పలువురు చెబుతున్నారు.

దయనీయస్థితిలో రైతుబజార్..

• అంతంతమాత్రంగా విక్రయాలు
• లక్ష్య సాధనలో వెనుకంజ
• రైతుబజార్‌లో రాజకీయ రొంపి..



ఎస్.కోట రైతుబజార్‌లో పనిచేయని ఆర్.ఓ ప్లాంట్



రైతు బజార్‌కి వెళ్లే దారిలో ఉన్న తోపుడుబళ్లు, వ్యాన్‌లు

శంగవరపుకోట: కేవలం తొమ్మిది మంది రైతులతో ఎస్.కోటలో 2017లో ఏర్పాటైన రైతుబజార్ 2019 చివరి నాటికి జిల్లాలో నంబర్ వన్‌గా నిలిచింది. అప్పటి ఎస్టేట్ ఆఫీసర్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఒక మంచి సంకల్పంతో రైతుబజార్‌ను అభివృద్ధి చేసి రైతుల సంఖ్యను వందకు చేర్చారు. వినియోగదారులకు కూడా తక్కువ ధరలకు నాణ్యమైన కూరగాయలు అందేలా చర్యలు తీసుకున్నారు. అయితే కాలక్రమంలో అధికారుల ఉదాసీనత, ఇతర కారణాల వల్ల రైతుబజార్ దయనీయస్థితికి చేరుకుంది. చివరకు తన ఉనికే కోల్పోయేలా ఉంది.

వెనుకంజ..

ప్రస్తుతం రైతుబజార్‌పై పర్యవేక్షణ లోపం.. ధరల నియంత్రణ లేకపోవడం.. పారిశుధ్య లోపం.. వ్యాపారుల్లో క్రమశిక్షణ లోపించడం.. నిజమైన రైతులకు చోటు లేకపోవడం.. తదితర కారణాలతో రైతుబజార్ లక్ష్య సాధనలో వెనుకంజలో ఉంది.

కంపుగొడుతోంది..

గతంలో మంచి పార్కులా తీర్చిదిద్దిన రైతుబజార్‌లో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, బెంచీలు, కచ్చితమైన పార్కింగ్ సదుపాయాలుండేవి. ప్రస్తుతం అందుకుభిన్నంగా సరైన గాలి, వెలుతురు లేక.. ఫ్యాన్లు లేక.. మురుగునీరు నిల్వతో కంపుగొడుతోంది. కొందరు తమ పలుకుబడితో తమ కూరగాయల్ని పొరుగువాళ్ల దుకాణాల్లో పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. సరైన ఫ్లోరింగ్‌లు, పెయింటింగ్, డ్రింకింగ్ వాటర్ లేక వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపారులకు గుర్తింపుకార్డుల ఊసేలేదు. తూనికలపై నిఘా లేదు. ధరలు కొన్ని డిస్‌ప్లే చేస్తే.. మరికొన్ని చోట్ల చేయడం లేదు. రూ.4.60 లక్షల నిధులు కేటాయించినా డిస్‌ప్లే బోర్డు, ఆర్‌ఓ ప్లాంట్ పనులు మాత్రం పూర్తి కాలేదు. నాలుగు నెలలుగా శానిటేషన్‌కు నిధులు విడుదల కాలేదు.

రాజకీయాల రైతుబజార్..

రైతుబజార్‌లో మౌలిక సౌకర్యాల కల్పన, పర్యవేక్షణను ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు. మూడేళ్లకు మార్చాల్సిన ఈఓను ఏడేళ్లుగా కొనసాగిస్తున్నారు. ఇందుకు కేవలం రాజకీయ ఒత్తిళ్లే కారణం. తాజాగా రైతుబజార్ ఈఓ బదిలీ విషయంలో అధికార పార్టీలో రెండు వర్గాలు పోటీపడ్డాయి. ఈఓను మార్చాలని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం.. అతన్నే కొనసాగించాలని ఎమ్మెల్యే వర్గం పట్టుబడ్డాయి. చివరకు ఎమ్మెల్యే వర్గం పైచేయి సాధించింది. దీంతో వీరికి రాజకీయ అవసరాలు తప్ప ప్రజల ఇబ్బందులు పట్టటం లేదన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

నిధులు కేటాయించాం..

రైతుబజార్ల అభివృద్ధిపై దృష్టి సారించాం. మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాం. ఎస్.కోట రైతుబజార్‌కు రూ. 4.60 లక్షలు మంజూరు చేశాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి లోపాలను సరిచేస్తాం.

– టీవీ రవికిరణ్, మార్కెటింగ్ శాఖ ఎ.డి

మత్తుతో జీవితాలు చిత్తు

• ఆర్డీఓ ఆశయ్య



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు, అధ్యాపకులు

చీపురుపల్లి: మత్తు పదార్థాలు వినియోగించినా, రవాణా చేసినా జీవితాలు చిత్తవుతాయని ఆర్డీఓ బి.ఆశయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం ద్వారా కలిగే నష్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ' సే నో డ్రగ్స్' పేరుతో కేంద్ర ప్రభుత్వం ముద్రించిన పోస్టర్లను డీఎస్పీ ఎస్.రాఘవులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కళాశాలలకు చదువుకునేందుకు వస్తున్న యువత చదువుపై మాత్రమే దృష్టి సారించాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని చెప్పారు. గంజాయి, గుట్కా, సిగరెట్, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఎస్సై గిరీష్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమేష్, ఎన్ఎస్ఎస్ పీఓ విజయేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని చల్లపేట ఫీడర్ పరిసరాల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్న నేపథ్యంలో మండలంలోని గంగచోళ్లపెంట, పత్రువాడ, కొత్తబగ్గాం, పాతబగ్గాం, చిట్టేయవలస, మెంటాడ, మర్రివలస గ్రామాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని ఏడీఏ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

లక్కవరపుకోట: మండల కేంద్రంలో గల 11 కేవీ రూరల్ ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ఏఈ సూరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గొల్జాం, కళ్లెంపూడి, ఎల్.కోట సీతారాంపురం.. వేపాడ మండలం పాటూరు, బొద్దాం, కొత్తబొద్దాం, ఓబలయ్యపాలెం, ముకుందపురం గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించాలి



మాట్లాడుతున్న లీగల్ కౌన్సిలర్ బ్యూల రాణి

గంట్యాడ: ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించాలని వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ కె. బ్యూలరాణి అన్నారు. మండలంలోని రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన్‌స్టాప్ సెంటర్ సేవలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా బాధితులకు రక్షణ, సంరక్షణ, వైద్య, న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ టి. అనిత, పాఠశాల హెచ్‌ఎం యశోద, తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



వ్యాన్ ద్వారా పాఠశాలలకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

మెరకముడిదాం: మండలంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 4040 సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఈఓలు చంద్రశేఖర్, ధర్మశ్రీను తెలిపారు. మెరకముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలానికి సంబంధించి అన్ని పాఠశాలలకు కిట్లు పంపిణీ చేశామన్నారు.

చెరువును తలపిస్తున్న జాతీయ రహదారి



అరుకు - విశాఖపట్నం జాతీయ రహదారిలో కొత్తవలస పెట్రోల్ బంకు వద్ద పరిస్థితి

కొత్తవలస: అరుకు – విశాఖపట్నం జాతీయ రహదారి అధ్వానంగా తయారైంది. ఏ మాత్రం వర్షం వచ్చినా రోడ్డు పక్కల నీరు నిల్వ ఉండడంతో రోడ్డు చెరువును తలపిస్తోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడు ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

వేపాడ: జిల్లా కేంద్రంలోని పూల్‌బాగ్ కాలనీలో గల జగన్నాథ కల్యాణ మంటపంలో బుధవారం జరగనున్న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్ములూరి జగ్గుబాబు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం పది గంటలకు జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధ్యర్యంలో జరగనున్న సమావేశానికి శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. మండల పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సందర్శన..

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లిలో ఉన్న రెండు ప్రాథమిక పాఠశాలలను విద్యాశాఖాధికారి ఎం. వెంకటరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, వంట సామగ్రి పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామ క్షేత్ర సహాయకుడు (ఫీల్డ్ అసిస్టెంట్) వి. శ్రీనివాసరావుకు జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. గ్రామానికి చెందిన వేతనదారులకు పూర్తిస్థాయిలో పని కల్పించకపోవడం.. పంచాయతీ తీర్మానం లేకుండా పనులు చేపట్టడం.. పనుల కల్పనలో వివక్ష కనబరచడం వంటి ఆరోపణల నేపథ్యంలో సంజాయిషీ ఇవ్వాలని నోటీస్ జారీ చేశారు. నోటీస్ అందుకున్న 14 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీస్‌లో పేర్కొన్నారు. పీడీ జారీ చేసిన నోటీస్‌ను ఫీల్డ్ అసిస్టెంట్‌కు అందజేసినట్లు ఏపీఓ సుందరరావు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట గ్రామ సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగుల సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థినులు విద్యార్హత పత్రాలతో నేరుగా పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.భూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద పోలీస్‌లు బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వారికి ఉపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ.. మితిమీరిన వేగం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

రైల్వే కాలనీలో చోరీ



దొంగతనం జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న క్లూస్‌టీమ్ సభ్యులు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని పురిటిపెంట రైల్వే కాలనీలో పాండ్రంకి పార్వతి ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో దొంగతనం జరిగిందని గజపతినగరం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్వతి కుటుంబ సభ్యులు క్యాంప్‌కు వెళ్లడంతో దొంగలు ఇంటిలోకి చొరబడి బీరువా పగులగొట్టి అరకిలో వెండి వస్తువులు, రూ. పది వేల నగదు దోచుకున్నారని చెప్పారు. పార్వతి కుమారుడు గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఇంటిని పరిశీలించామన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్యాయం..



సమావేశంలో మాట్లాడుతున్న రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు

• వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు

గజపతినగరం రూరల్: రైతుల శ్రేయస్సును పక్కన పెట్టి, ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిన కూటమి ప్రభుత్వం హయాంలో రైతులకు అన్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పాలన సాగించిందన్నారు. ప్రస్తుత కూటమి నాయకులు రైతులకిచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు విత్తనాలు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల్లో ఎరువులు, విత్తనాలు సీజన్ ప్రకారం లభించేవని తెలిపారు. రైతు సమస్యలపై ఎనలేని పోరాటం చేస్తానని, 24 గంటలూ రైతులకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

విజయవంతం చేయండి..

ఈ నెల 7వ తేదీన గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలోని బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల నుంచి సుమారు ఐదు వేల మందికి తక్కువ కాకుండా పార్టీ శ్రేణులు హాజరయ్యేలా స్థానిక నాయకులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, నాయకులు బెల్లాన త్రినాథరావు, కరణం ఆదినారాయణ, మండల శ్రీనివాసరావు, మహాదేవ ఫణీంద్రుడు, చుక్క మురళి, దత్తి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: మండలంలోని తెన్నుబొడ్డవర ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఐ.అశోక్‌రాజు నేతృత్వంలో అమ్మపాలెం, భర్తాపురం ప్రాథమిక పాఠశాలల్లో ఎనిమిదేళ్ల పాటు సేవలందించి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు సీహెచ్.భారతి, బి.పద్మావతి, కె.జగదీశ్వరి, వి.కనకారావు, కేవీ రమణ, భాస్కరరావులను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. అనంతరం కొత్తగా హెచ్‌ఎం బాధ్యతలు స్వీకరించిన అశోక్‌రాజును సహోపాధ్యాయులు అభినందిస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు కె.మోహన్‌రాజ్, అల్లు సురేష్, సీహెచ్.మధుమోహన్, కె.బంగారునాయుడు, గొల్లు సూరిబాబు, టి.అప్పారావు, సీహెచ్ సూరిబాబు, టి.కృష్ణ రవిశంకర్, కాశీవిశ్వనాథం, ఆర్.రాంబాబు, పి.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి



బొద్దాం పంచాయతీ గ్రామసభలో సూచనలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు అందించేలా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సూర్యనారాయణ తెలిపారు. బొద్దాం గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి క్లాప్‌మిత్రలకు పలు సూచనలు చేశారు.

కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రా రామసత్యవతి, పంచాయతీ కార్యదర్శి భారతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే శింగరాయిలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, పంచాయతీ అభివృద్ధి, విత్తనాల పంపిణీ, తదితర అంశాలపై చర్చించారు.

జునోసిస్‌పై అవగాహన



కళాశాల అసోసియేట్ డీన్, డాక్టర్లతో ఆశా వర్కర్లు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గరివిడి వెటర్నరీ కళాశాలలో మండలంలో గల ఆశా వర్కర్లకు పశు వైద్యారోగ్యం, సముదాయ రోగ అధ్యయన విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జునోసిస్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను మాట్లాడుతూ.. గ్రామీణ జీవన విధానంలో, సాధారణ కుటుంబ జీవనశైలిలో పాడి పరిశ్రమ, పెంపుడు జంతువుల పెంపకం ఒక భాగమైందన్నారు. పశుపక్షాదుల నుంచి మనుషులకు కొన్ని రకాల రోగాలు సంక్రమిస్తున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా సేవలందిస్తున్న ఆశా వర్కర్లు జునోటిక్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆణి సుప్రియ, డాక్టర్ నాగమల్లిక, డాక్టర్ సురేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.